క్లుప్తంగా

ఓటుహక్కుపై అవగాహన

కరకగూడెం: ప్రజాస్వామ్యానికి బలమైనది ఓటు ఎంతో బలమైనదని కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం 'మీ తహసీల్దార్ మీ ఇంటికి'అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని సమత్ భట్టుపల్లి గ్రామంలో ఆయన పర్యటించి గ్రామస్తులకు ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

భద్రాచలం(భద్రాచలంటౌన్): సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాద్రి ఆలయ ఈఓ రమాదేవి మాట్లాడారు. కళావేదిక జిల్లా అధ్యక్షుడు కేశబోయిన ప్రసాద్, కృష్ణమాచారి, చిట్టే లలిత, మాధవరెడ్డి, శ్రీనివాస్, తులసీదాస్, పద్మావతి, తిరుమలరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్‌లోని ముత్యాలమ్మ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తుల నడుమ మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని గోదావరి నదికి తీసుకెళ్లి అభిషేకం చేశారు. అమ్మవారిని ప్రధాన ఆలయంలో ప్రతిష్ఠించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ అధ్యక్షుడు హరిచంద్ర నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహోత్సవాలు

గుండాల: మండలంలోని పడుగోనిగూడెం గ్రామంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉమామహేశ్వర స్వామి ఆలయ జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి నాగయ్య, గ్రామస్తులు తెలిపారు. ఈ మహోత్సవానికి సంబంధించి మంగళవారం ఆలయ ప్రాంగణంలో పోస్టర్ విడుదల చేశారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు త్రయాహ్నిక దీక్షతో పూజాకార్యక్రమాలు నిర్వాహన జరుగుతుందని, 12న అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అన్నదానం

అశ్వారావుపేట: అశ్వారావుపేటకు చెందిన శీమకుర్తి ఉమామహేశ్వరరావు, ఉమాకుమారి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా మంగళవారం స్థానిక అమ్మ సేవాసదనంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దూపకుంట్ల దుర్గారావు, ఆశ్రమ నిర్వాహకురాలు కూరపాటి అనసూయ పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో సిద్ధాంతి కామవరపు విజయమారుతి శర్మ మంగళవారం మజ్జిగను పంపిణీ చేశారు. తమ పూర్వికుల నుంచి వస్తున్న ఆచారం మేరకు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రతి మంగళవారం మజ్జిగను అందిస్తున్నారు.

వీరభద్రుడి నిజరూప దర్శనం

చర్లరూరల్: మండలంలోని తేగడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి క్రోధి నామ సంవత్సరం సందర్భంగా మంగళవారం నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని గ్రామస్తుల సమక్షంలో ఆలయ శైవార్చకులు పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. చర్ల సీఐ రాజు వర్మ కుటుంబ సభ్యులు ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎల్లమ్మ బోనాలు

గుండాల: ఉగాది వేడుకను పురస్కరించుకుని ఆళ్లపల్లి మండలం మర్కోడులో ఎల్లమ్మ తల్లికి బోనాల పండుగ నిర్వహించారు. గౌడ కులస్తులు ఊరేగింపుగా బోనాలతో వెళ్లి ఎల్లమ్మ తల్లి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుల్లతో నృత్యాలు చేస్తూ వేడుకలను ఘనంగా జరిపారు.

గెలుపునకు కృషి చేయాలి

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో బీఆర్ఎస్ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తీర్మానించారు. నియోజకవర్గంలోని అన్ని బూతుల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి సమన్వయ కమిటీ నిర్ణయం మేరకు ముందుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సి.త్యాగరాజన్ పలు సమస్యలను ఆయన ముందుంచారు. సంఘం బ్రాంచ్ కార్యదర్శి సిర్వేరు గట్టయ్య, ఎండి.షాబుద్దీన్, సూరపాక రాములు, జయరాజ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. క్రోధినామ సంవత్సర పర్వదినం అన్ని చోట్ల వేడుకగా సాగింది. గృహిణులు తమ ఇళ్లు, వాకిళ్లను శుభ్రం చేసుకున్నారు. ఇంటి ముంగిట ముగ్గులతో, ఇళ్లను మామిడి, వేప ఆకుల తోరణాలతో అలంకరించుకున్నారు. ఇంటిల్లిపాది అభ్యంగనస్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించారు. ఆలయాల్లోని దేవతా మూర్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పంచాంగ శ్రవణాలు జరిగాయి. ప్రజలు షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని సేవించారు. రైతులు తమ రాశి ఫలాలు తెలుసుకుని ఏరువాకలు సాగారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: రెడ్డిపాలెం రామాలయంలో పూజలు చేస్తున్న రైతులు



మణుగూరురూరల్: ఎమ్మెల్యే పాయంకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



అశ్వారావుపేట(ములకలపల్లి): అభయాంజనేయ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం..



దమ్మపేట: శివాలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు



దుమ్ముగూడెం: పర్ణశాల ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న అర్చకులు



అశ్వాపురం: కాంగ్రెస్ కార్యాలయంలో ఉగాది పచ్చడి సేవిస్తున్న పార్టీ శ్రేణులు



అన్నపురెడ్డిపల్లి: శివాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకుడు

జాతరలో నీటి ఎద్దడి

- మండుటెండలో తాగునీటికి కటకట
- భక్తులు, దుకాణదారుల ఇబ్బందులు

అశ్వారావుపేట: మండలంలోని వినాయకపురం ముత్యాలమ్మ తల్లి ఆలయ జాతర పరిసర ప్రాంతాలకు ఎంతో ప్రతిష్ఠాత్మకమైంది. అవిభాజ్య ఖమ్మం, కృష్ణా, పశ్చిమగోదావరి, నల్లగొండ జిల్లాలతోపాటు ఈ ప్రాంతానికి చెందిన హైదరాబాదు, విశాఖ వాసులు ఈ జాతరకు క్రమం తప్పకుండా వస్తుంటారు. ఏటా 5రోజుల పాటు జరిగే ఈజాతరకు లక్షల్లో భక్తులు వస్తుంటారు. వందల సంఖ్యలో దుకాణాలు ఏర్పాటు చేస్తారు. ఇంతటి ప్రాధాన్యత జాతరలో భక్తులు, దుకాణదారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్వాహకులు విఫలమయ్యారని విమర్శలకు వినిపిస్తున్నాయి.

సమస్య ఇదీ..

జాతరలో ఏర్పాటు చేయాల్సిన కనీస సౌకర్యాల్లో ముఖ్యంగా భక్తులు తాగునీరు అందిచలేకపోతున్నారు. ఆలయ ప్రాంగణంలోని బావిలో రెండు పంపులు ఉంటాయి. ఇవి రెండూ చెడిపోవడంతో మంగళవారం భక్తులకు, దుకాణాదారులకు తాగునీరు అందలేదు. దీంతో నీటికి రూ.30 చెల్లించి బయట కొనుగోలు చేశారు. దుకాణాల వెనుకాలే నివాసాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు వంటవార్పు, ఇతర అవసరాలకు నీటి అవసరం చాలా ఉంటుంది. ఈ తరుణంలో వారం రోజుల పాటు ఇక్కడే ఉండాలి. కానీ నీటి సౌకర్యాన్ని కల్పించకుండా ఆలయ ఈఓ నిర్లక్ష్యం వహిస్తున్నారని.. ఇష్టం ఐతే ఉండండి.. కష్టం అయితే పోండి అంటున్నారని దుకాణదారులు వాపోతున్నారు. దుకాణాల మధ్యలో కాలినడకకు నీడ లేకపోవడంతో ఎండలో ఇసుకలో నడిచేందుకు భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దెలు కూడా గజానికి రూ.400 చొప్పున దేవాదాయ శాఖ నిర్ణయిస్తే అనధికారికంగా అధిక అద్దెలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఈ విషయాలను ఆలయ ఈఓ సూర్యప్రకాశరావు దృష్టికి తీసుకువెళ్లగా బావిలో రెండు పంపులు పనిచేయకపోతే చేయగలిగిందేమీ లేదన్నారు. అయినా గ్రామపంచాయతీ నుంచి ట్రాక్టర్ ఏర్పాటు చేశారని అన్నారు. అంతకుమించి తామేం చేయలేమన్నారు. అద్దెలు నిబంధనల ప్రకారమే వసూలు చేస్తున్నామని తెలిపారు.



తాగునీటి కోసం పడిగాపులు కాస్తున్న ప్రజలు

ఐదు రోజులుగా ఇబ్బంది పడుతున్నాం



ఐదు రోజులుగా నీళ్లకు ఇబ్బంది పడుతున్నాం. రాత్రి వేళల్లో అమ్మకాలు ఉంటాయి. పగటి వేళనే పనులు చేసుకోవాలి. ఊరు కాని ఊరు వచ్చాం. ఊరి బయట అడవిలో గుడి, చుట్టుపక్కల ఎక్కడకు నీళ్ల కోసం వెళ్లినా దుకాణం వదిలి వెళ్లాలి. నీళ్ల ఏర్పాటు చేయకుండా నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

– వెంకటనర్సమ్మ, వ్యాపారి, తిరువూరు

ఉంటే ఉండు, పోతే పో.. అంటున్నారు



లాక్ డౌన్ మూడేళ్ల వ్యాపారాలు లేవు. ఇప్పుడిపుడే కోలుకుంటున్నాం. ఇక్కడ అద్దెల రూపంలో రోజుకో ధర చెప్పి వేధిస్తున్నారు. కనీస సౌకర్యాలు ఏమాత్రం లేవు. తాగేందుకు మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదు. ఇదేమని ఈఓను అడిగితే ఇష్టం ఉంటే ఉండు.. పోతే పో.. అని అంటున్నారు.

– శేషగిరి, వ్యాపారి, పుట్రేల

ముస్లింల అభ్యున్నతిపై దృష్టి

చంద్రుగొండ: ముస్లింల అభ్యున్నతిపై రాష్ట్రంలోని కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలోని మసీద్ రంజాన్ నెల సందర్భంగా ఇఫ్తార్ కార్యక్రమంలో మంగళవారం సాయంత్రం ఆయన పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ చేసిన ఆయన అనంతరం మాట్లాడుతూ.. ప్రధానంగా పేద ముస్లింలకు అన్ని విధాల ప్రభుత్వం తరుపున ఆదుకుంటామన్నారు. మసీద్‌కు ప్రహారీగోడ, గ్రామంలో నుంచి చెరువుకట్ట మీదుగా జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు వినతిపత్రం అందించగా పనులు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, మసీద్‌కమిటి సదర్ ఎస్కే నజీర్, సయ్యద్ రఫీ, సయ్యద్ అబ్దుల్ అలీం, సయ్యద్ షఫీ, ఎస్కే సలీం, కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, కృష్ణారెడ్డి, గుగులోతు బాబు, మచ్చా కుమార్, దారావత్ రామారావు, సంకా శంకర్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: రంజాన్ పండుగను పురస్కరించుకుని మణుగూరు ఏరియాలోని బొంబాయి కాలనీ మసీద్‌లో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ముస్లింలకు మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఏరియా నాయకుడు దాసి వీరభద్రయ్య మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. అనంతరం టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు ముస్లింలకు చరవాణిలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అబ్దుల్ రవూఫ్, కాపా శివాజీ, టంగుటూరి శ్రీనివాస్, జంపయ్య, ఉపేందర్, హనుమంతరావు, రామారావు, మాజీ వార్డ్ సభ్యులు కలగూర శంకర్, మజీద్ కమిటీ సభ్యులు ఎండి.హబీబ్, హుస్సేన్ ఖాన్, భరోసా సోసైటి సభ్యులు ఎండి.అమీనుద్దీన్, ముస్లిం మత పెద్దలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ముస్లింలకు దుస్తులు పంపిణీ



దుస్తులు, పండుగ సామగ్రి అందజేస్తున్న ముఫ్తీ అబ్దుల్ రహెమాన్

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని మసీద్‌లో దివంగత నాయబ్‌ఖాజీ మొహమ్మద్ అబ్దుల్‌హుసేన్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పేదముస్లింలకు దుస్తులు, రంజాన్ పండుగ సామగ్రిని మంగళవారం సాయంత్రం పంపిణీ చేశారు. ముఫ్తి మొహమ్మద్ అబ్దుల్ రహెమాన్ చేతులమీదుగా పేదలకు అందించారు. కార్యక్రమంలో మసీద్‌కమిటి సదర్ యండీ షమీహుసేన్, ఫయ్యాజ్‌హుసేన్, జహీర్‌హుసేన్, జాకీర్‌హుసేన్, నాబీద్, ముజమ్మీల్‌హుసేన్, జాహీద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు వెండి తొడుగు

బూర్గంపాడు: సారపాక ముత్యాలమ్మపేటలోని ముత్యాలమ్మ ఆలయంలో ఉగాది సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి చేయించిన వెండి తొడుగును గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అనంతరం వెండి తొడుగును అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 18వ తారీకు నుంచి 23 వరకు అమ్మవారి ఆలయంలో తిరునాళ్ల మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23వ తారీకు గోపయ్య,తిరుపతమ్మ వార్ల కల్యాణాన్ని వైభవంగా జరిపించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, భీముడు, పానుగంటి రాఘవులు, చల్లా రమేష్, నర్సింహాచారి, చల్లా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గుండాల: ఇటీవల సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టర్ ద్వారా రికవరీ చేసి ఎస్సై కిన్నెర రాజశేఖర్ మంగళవారం బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇటీవల కాలంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 14 మందికి చెందిన మొబైల్స్‌ను వారికి అప్పగించామన్నారు. మొబైల్ పోయినవారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సీఈఐఆర్ టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. వెంకట్, రాంబాబు, సత్యనారయణ, మంగిలాల్, రాము పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో కొలువై ఉన్న చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా భక్తులు పోటెత్తారు. జాతర ఉత్సవాలు నాలుగవ రోజుకు చేరగా.. అమ్మవారు భక్తులకు శ్రీ కుంకుళ్లమ్మ అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాలమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని అశ్వరథంపై గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించగా మహిళలు కోలాట నృత్యాలు చేశారు. గిరిజనులు కొమ్ము నృత్యాలతో సందడి చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

అశ్వారావుపేట: అశ్వారావుపేట కమ్మసంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కమ్మసంఘం అధ్యక్షులు సంకురాత్రి సతీష్, సభ్యులు మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గడిచిన ఎనిమిదేళ్లుగా కూలర్‌తో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సంకురాత్రి సతీష్, ఉపాధ్యక్షుడు మార్ని రామారావు, దమ్మపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తలసీల బాలకృష్ణ, కోశాధికారి ఈదర రామ్మోహన్, సభ్యులు ముళ్లపూడి నాగేంద్ర, మాజీ అధ్యక్షులు అల్లూరి వెంకటరామారావు తదతరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఖమ్మంపాడు, జగన్నాధపురం గ్రామాల్లో మంగళవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆనరిచడ్ ట్రైబల్ మినిస్ట్రిస్(యూటీఎం) సంస్థ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో సంస్థ అధ్యక్షులు స్టియోస్ దొర, సేవకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గుమ్మడవల్లి ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీఈ బీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోగల గ్రామాలలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని వెల్లడించారు.

అశ్వారావుపేట(ములకలపల్లి): మండలంలోని పొగళ్లపల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌-కో ఏఈ లక్ష్మీనర్సింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పీడర్‌లో మరమ్మతులు చేయనున్న కారణంగా చౌటిగూడెం, పొగళ్లపల్లి, తాళ్లపాయ, రింగిరెడ్డిపల్లి, తిమ్మంపేట. గుండాలపాడు, మంగళిగుట్ట, కొబ్బరిపాడు గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

డ్రెయినేజీల్లో చెత్త తొలగింపు

చర్లరూరల్: చర్ల మేజర్ గ్రామ పంచాయతీలోని 'డ్రెయినేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి..' అను శీర్షికన ఈనెల ఐదవ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు.. పారిశుద్ధ కార్మికులచేత మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. డ్రెయినేజీలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ఆయిల్ బంకు ఏరియా, అంబేడ్కర్ సెంటర్ ప్రాంతాల్లోని డ్రెయినేజీలలో నిల్వ ఉన్న నీరు నిలవకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు.

సాక్షి ఎఫెక్ట్..



ఆయిల్ బంకు ఏరియాలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

గ్రామ పొలిమేర్లలో తోరణాలు

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామ పొలిమేరల్లో వేద పండితుల సమక్షంలో గ్రామ పెద్దలు గ్రామ తోరణాలను కట్టారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దమ్మపేట గ్రామ సరిహద్దులో ఉన్న పొలిమేరల్లో వేద పండితులు కామవరపు విజయమారుతి శర్మ సమక్షంలో గ్రామ సుభిక్షాన్ని కాంక్షిస్తూ తోరణాలను ఏర్పాటు చేశారు. విజయమారుతి శర్మ మాట్లాడుతూ.. ఈ తోరణాల వల్ల చెడు శక్తులు గ్రామంలోకి ప్రవేశించకుండా, గ్రామ దేవతలు గ్రామ ప్రజలను సంరక్షిస్తారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మూసుకుపోయిన మూడోకన్ను

- భద్రాచలంలో 110 సీసీ కెమెరాలు ఏర్పాటు
- అందులో పనిచేస్తున్నవి 66 మాత్రమే
- ఫలితంగా నేరాల ఛేదనలో అవాంతరాలు



పాత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ రోడ్డులో అలంకార ప్రాయంగా ఉన్న సీసీ కెమెరా



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అప్పటి భద్రాచలం ఏఎస్పీ రోహిత్‌రాజ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: నేరాల నియంత్రణకు పోలీసు యంత్రాగం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఉన్నా ఉపయోగం లేకుండా పోతున్నాయి. నేరాల నియంత్రణకు దోహద పడే సీసీ కెమెరాల నిర్వహణలో అధికారులు అలసత్వం వహించడతంతో మూడో కన్ను మూసుకుపోయింది. ఒక కెమెరా నిఘా వంద మంది పోలీసులతో సమానం అని పోలీసులే ప్రజలకు వివరిస్తున్నారు. అయితే భద్రాచలంలో సీసీ కెమెరాల నిర్వహణలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పట్ల పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబట్టి ఏర్పాటు..

భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరగకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా 2021 ఆగస్టులో అప్పటి జిల్లా ఎస్పీ సునీల్ దత్ ఆదేశాల మేరకు భద్రాచలం ఏఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో ఉన్న వ్యాపారస్తులు, రాజకీయ నాయకుల, ఇతరుల సహకారంతో దాదాపు రూ.26 లక్షల వ్యాయంతో 89 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తదనంతరం విడతల వారిగా వివిధ వ్యాపారులు, స్థానికుల ఆర్థిక సహాయంతో ఆ సంఖ్య కాస్త 110 చేరింది. సీసీ కెమెరాల వినియోగంతో నేరాల నియంత్రణతో పాటు, పలు కేసుల్లో పురోగతిని పోలీసులు త్వరగా సాధించారు. రోజులు గడుస్తున్న కొద్ది పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 110 సీసీ కెమెరాల పనితనం తగ్గుతూ వచ్చింది. పనిచేస్తున్న వాటి సంఖ్య క్రమంక్రమంగా తగ్గుతూ 101కి చేరుకుంది. కాగా వీటిలో ప్రస్తుతం 66 మాత్రమే పనిచేస్తున్నట్లు సమాచారం. పనిచేయని వాటిల్లో పట్టణంలోని యూబీ రోడ్డుతో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలున్నాయి. దీంతో అవి అలంకార ప్రాయంగా మారాయి.

నిందితుల గుర్తింపులో జాప్యం..

గత కొద్ది రోజులుగా పనిచేయని సీసీ కెమెరాలు మూలంగా నేరాల నియంత్రణలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా దోపిడీలు, వాహనాల దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అందుకు బాధ్యులను వెంటనే గుర్తించేందుకు పోలీసులు ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి. ఇక కొన్ని కెమెరాలు పనిచేస్తున్నా అవి నాసిరకంగా ఉండడంతో వర్షం పడ్డా లేదా చీకటిగా ఉన్నా అవి రికార్డు చేసిన పుటేజీలు స్పష్టంగా కనిపించడంలేదు. వీటి నిర్వహణ బాధ్యత పట్ల సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసే కెమెరాలు పూర్తి స్థాయిలో పనిచేసే అవకాశం ఉంది. కాగా సీసీ కెమెరాల మరమ్మతులు భారాన్ని ఎవరు భరించాలో స్పష్టత లేక పోవడంతో వాటి నిర్వహణలో జాప్యం జరుగుతుందని సమాచారం.

మరమ్మతు చేయించాలి..



భద్రాచలంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కోసం వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖుల నుంచి నిధుల సేకరణ చేసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఉండడం వల్ల వ్యాపారస్తులతో పాటు స్థానిక ప్రజలకు కూడా చాలామేలు జరిగేది. పనిచేయని కెమెరాలను సంబంధిత అధికారులు బాగు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరం.

– రెడ్డిబత్తుల కృష్ణారెడ్డి, భద్రాచలం

సమస్యను పరిష్కరిస్తాం..



ఇటీవల కొన్ని సీసీ కెమెరాలు పనిచేయడంలేదన్న విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పని చేయని కెమెరాలను గుర్తించి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తెస్తాం. సీసీ కెమెరాల నిర్వహణలో జాప్యం జరగకుండా రానున్న రోజుల్లో అన్ని విధాల చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ మీ పరిధిలో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

– సంజీవరావు, భద్రాచలం సీఐ